సాక్షి
పార్వతీపురం మన్యం
శనివారం, 6, జూలై, 2024

న్యూస్‌రీల్

బిత్రపాడు పంట పొలాల్లో ఏనుగులు



పండ్ల తోటల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

జియ్యమ్మవలస: మండలంలోని బిత్రపాడు పంట పొలాల్లో శుక్రవారం ఏనుగుల గుంపు దర్శనమిచ్చింది. అరటి, పామాయిల్ తోటల్లో తిష్టవేశాయి. రాత్రి సమయాన గ్రామంలోకి వచ్చే అవకాశం ఉండడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి వాటిని తరలించే ఏర్పాట్లు చేయాలని రైతులు కోరుతున్నారు.

పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక చట్టం అమలు

- నోడల్ అధికారులను నియమించిన కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: పనిప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధం, నిషేధ చట్టం –2013ను జిల్లాలో పకడ్బందీగా అమలు కోసం నోడల్ అధికారులను నియమిస్తూ కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఉత్తర్వులు జారీ చేశారు. డివిజన్, మండలం, మున్సిపల్ స్థాయిల్లో ఉద్యోగుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి జిల్లా స్థాయికి తెలియజేసే బాధ్యత నోడల్ అధికారులపై ఉంటుంది. డివిజన్ స్థాయిల్లో మూడు డివిజన్ల ఆర్డీఓలు, 27 మండలాల తహసీల్దార్లు, నలుగురు మున్సిపల్ కమిషనర్లను నోడల్ అధికారులుగా నియమించారు.

మంత్రిని కలిసిన అధికారులు



మంత్రికి మొక్కను బహూకరిస్తున్న ఉద్యోగులు

విజయనగరం అర్బన్: జిల్లా పరిషత్ అతిథిగృహంలో రాష్ట్ర చిన్నతరహా పరిశ్రమలు, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను శుక్రవారం వివిధ శాఖల అధికారులు కలిశారు. జిల్లా రెడ్ క్రాస్ అధ్యక్షుడు కేఆర్‌డీ ప్రసాదరావు ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం మంత్రిని కలిసి రెడ్‌క్రాస్ కార్యక్రమాలను వివరించింది. జిల్లా గృహనిర్మాణ సంస్థ కార్యక్రమాలను ఆ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్ మంత్రికి తెలియజేశారు. జిల్లాలో సెర్ప్ ఆధ్వర్యంలో చేపడుతున్న నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలపై డీఆర్‌డీఏ పీడీ కళ్యాణ చక్రవర్తి వివరించారు. సహకార శాఖ అధికారులు సైతం మంత్రిని కలిశారు.

హైకోర్టు ఏజీపీగా సంకిలి వాసి

రేగిడి: మండలంలోని సంకిలి గ్రామానికి చెందిన చిన్నాల ప్రవీణ్‌కుమార్ హైకోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమితులయ్యారు. లా కోర్సు పూర్తిచేసిన తర్వాత ఆయన విజయవాడలోని హైకోర్టులో న్యాయవాదిగా సేవలందిస్తూ వచ్చారు. ఎనిమిదేళ్ల పాటు కీలక కేసులు వాదించి ఖ్యాతి గడించడంతో ఏజీపీగా అవకాశం లభించింది. ప్రవీణ్‌కుమార్ తండ్రి చిన్నాల పకీరునాయుడు కూడా రాజాం కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్నారు. ఏజీపీగా నియామకమైన ప్రవీణ్‌కుమార్‌కు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

తుప్పల్లో ఏడు నెలల శిశువు



శిశువుకు చికిత్స అందిస్తున్న విజయనగరం ప్రభుత్వాస్పత్రి వైద్య బృందం

జామి: మండలంలోని భీమసింగి గ్రామ శివారులోని ముళ్లపొదల్లో ఏడు రోజుల ఆడ శిశువు లభించడం స్థానికంగా కలకలం రేపింది. శిశువు ఏడుస్తుండడంతో స్థానికులు గుర్తించి ఇంటికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న అంగన్‌వాడీ కార్యకర్తలు అక్కున చేర్చుకున్నారు. సూపర్‌వైజర్ కృష్ణవేణికి సమాచారం ఇచ్చారు. శిశువు బరువు తక్కువగా ఉండడంతో విజయనగరం ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదుచేసినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తెలిపారు.

సచివాలయ సేవలు బంద్!



- కొద్దిరోజులుగా సర్వర్ మొరాయింపు
- ధ్రువపత్రాల జారీలో జాప్యం
- ఆవేదనలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు
- గత ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన వ్యవస్థపై చిన్నచూపు!
- నిర్వీర్యం చేసే ప్రయత్నాలు సాగుతున్నాయన్న అనుమానాలు

సాక్షి, పార్వతీపురం మన్యం:

గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేస్తూ, గత ప్రభుత్వ హయాంలో నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిన విషయం విదితమే. నాటి నుంచి నేటి వరకు ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలను అందించిన సచివాలయాలు.. నేడు మౌనం వహిస్తున్నాయి. సర్వర్లు పనిచేయడం లేదన్న కారణంతో ప్రజలకు కొద్దిరోజులుగా ఇక్కడ సేవలు అందడం లేదు. గతంలో ప్రజలకు ఏ సమస్య వచ్చినా మండల కేంద్రానికో, జిల్లా కేంద్రానికో వెళ్లాల్సి వచ్చేది. సచివాలయ వ్యవస్థ వచ్చిన తర్వాత సుమారు 35 విభాగాలకు సంబంధించిన 545 వరకు ప్రభుత్వ సేవలు వీటి ద్వారానే అందుతున్నాయి. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, రైతులకు కావాల్సిన మ్యూటేషన్, వన్‌బీ, అడంగల్, రేషన్ కార్డులు, ఆధార్ చేర్పులు, మార్పులు, రిజిస్ట్రేషన్, వివాహ ధ్రువీకరణ పత్రాలు, లైసెన్సులు, విద్యుత్ మీటర్లు, పింఛన్ల మంజూరు, ప్రభుత్వ పథకాల లబ్ధి.. ఇలా ఏది కావాలన్నా గతంలో ఇక్కడ నుంచే దరఖాస్తు చేసుకునేవారు. వీటికోసం గతంలో వివిధ కార్యాలయాల చుట్టూ వ్యయప్రయాసలకు ఓర్చి తిరగాల్సి వచ్చేది. ప్రధానంగా గ్రామీణ ప్రాంత ప్రజలు ఆయా ధ్రువపత్రాల కోసం తీవ్ర ఇబ్బందులు పడేవారు. ప్రజల ముంగిటకే సేవలు అందించాలన్న ఉద్దేశంతో ఈ సేవలన్నింటినీ నాటి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఒకే గొడుకు కిందకు తీసుకొచ్చారు. 2 వేల జనాభా గల గ్రామాలను, లేదా వార్డులను కలుపుతూ గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో 350 సచివాలయాలుండగా సుమారు 3,200 మంది ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. అన్ని వర్గాలకూ అవసరమైన సేవలను నిర్ణీత కాలవ్యవధిలో అందించాల్సిన ఈ కార్యాలయాల్లో ఇప్పుడు సర్వర్లు పని చేయడం లేదన్న సమాధానమే ఎక్కడికి వెళ్లినా వినిపిస్తోంది. రోజుకు ఉదయం ఒకట్రెండు, సాయంత్రం ఒకట్రెండు సర్టిఫికెట్లే అవుతున్నాయని సిబ్బంది చెబుతున్నారు.

తప్పని నిరీక్షణ...

నాలుగైదు రోజులుగా ఏపీ సేవా పోర్టల్‌కు సంబంధించిన సర్వర్ నెమ్మదించినట్లు సిబ్బంది చెబుతున్నారు. ప్రస్తుతం పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశాలు జరుగుతున్నాయి. విద్యార్థులకు కుల, ఆదాయం వంటి ధ్రువపత్రాలు అవసరమవుతున్నాయి. వీటి కోసం సచివాలయాలకు పెద్ద సంఖ్యలో వెళ్తున్నారు. ఇక్కడ మాత్రం ధ్రువపత్రాలు జారీ కావడం లేదు. రోజుల తరబడి తిరుగుతున్నా ఫలితం ఉండడం లేదని, సర్వర్ పని చేయడం లేదన్న సమాధానమే ఎప్పుడు వెళ్లినా వస్తోందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇదే విషయం పాఠశాలలు, కళాశాలల్లో చెబితే అంగీకరించడం లేదంటూ ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

వాస్తవమా.. ఉద్దేశపూర్వకమా!

గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ గత ప్రభుత్వ హయాంలో ఏర్పడింది. అప్పట్లో ఏర్పడిన వ్యవస్థలన్నింటిపైనా కక్షగట్టి, నిర్వీర్యం చేస్తున్న ప్రస్తుత కూటమి ప్రభుత్వం.. సచివాలయ వ్యవస్థపైనా అదే పద్ధతి అవలంబిస్తుందా? అన్న అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. గతంలో పని చేసిన మీసేవ కేంద్రాలను ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాల ద్వారా ప్రారంభించాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉందన్న ప్రచారం సాగుతోంది. సచివాలయాల్లో లభించే సేవలన్నీ మీసేవలో లభిస్తాయి. దీంతో సచివాలయాల్లో సేవలను నిలుపు చేస్తే.. ప్రజల్లో వీటిపై విశ్వాసం సన్నగిల్లుతుందని, క్రమంగా మరలా మీసేవలను వైపు మరలుతారని ప్రభుత్వ ఆలోచనగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. సర్వర్ల మొరాయింపు విషయమై గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి రామచంద్రరావు వద్ద ప్రస్తావించగా.. ఏపీ సేవా పోర్టల్ సర్వర్ నెమ్మదించడం వల్ల సమస్య ఏర్పడిందని, ఒకట్రెండు రోజుల్లో పరిష్కారమవుతుందని చెప్పారు. యథావిధిగా సేవలు ప్రారంభమవుతాయని తెలిపారు.

ఈ పాపం ఎవరిది?



ఈశ్వరరావు, ఆదిలక్ష్మిల మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసులు, గుమిగూడిన గ్రామస్తులు

- విద్యుత్ షాక్‌తో భార్యాభర్తలు మృతి
- పొలానికి వెళ్లిన రైతు దంపతుల మృతితో గ్రామస్తుల ఆందోళన
- విద్యుత్‌శాఖ అధికారులతో వాగ్వాదం
- బాధ్యులెవరో తేల్చేవరకు మృతదేహాలు తరలించేందుకు ససేమిరా..
- గతనెలలో తెగిపడిన విద్యుత్ తీగెలు ఎందుకు సరిచేయలేదంటూ నిలదీత
- ప్రభుత్వం స్పందించాలంటూ డిమాండ్
- గ్రామస్తులకు సర్దిచెప్పిన పోలీసులు

మెంటాడ:

నిర్లక్ష్యం ఎవరిదైనా.. ఇద్దరి నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. అమాయకులైన రైతు దంపతులు తనువు చాలించారు. ఆరుగాలం శ్రమించి అందరికీ అన్నం పెట్టే రైతు పొలం పనికి వెళ్లి విద్యుత్ షాక్‌తో మట్టిలో కలిసిపోగా.. నిత్యం పొలం పనిలో భర్తకు తోడుగా ఉండే భార్య.. ఆ రోజు ఎప్పటికీ పొలం నుంచి భర్త ఇంటికి రాకపోయేసరికి పరుగున వెళ్లింది. భర్త పొలంలో విగత జీవిగా పడి ఉండడాన్ని చూసి తట్టుకోలేక భోరున విలపిస్తూ ఆయనను లేపే ప్రయత్నంలో ఆమె కూడా కన్నుమూసింది. ఈ విషాదకర ఘటన మెంటాడ మండలం మీసాలపేటలో శుక్రవారం చోటుచేసుకుంది. రైతు దంపతుల మృతి వార్త గ్రామస్తుల్లో ఆగ్రహాన్ని తెప్పించింది. గ్రామస్తులందరూ ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ పాపం ఎవరిదంటూ విద్యుత్‌శాఖ అధికారులను నిలదీశారు. గతనెలలో తెగిపడిన విద్యుత్ తీగెలను ఎందుకు సరిచేయలేదంటూ మండిపడ్డారు. పోయిన ప్రాణాలు తీసుకురాగలరా అంటూ ప్రశ్నించారు. మృతికి బాధ్యులెవరో తేల్చేవరకు మృతదేహాలను తరలించేందుకు వీలులేదని తేల్చిచెప్పారు. కాసేపు ఆందోళన చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని పోలీసులు సర్దిచెప్పి గ్రామస్తులను శాంతింపజేశారు.

వరుణుడి కరుణలేక...

మీసాలపేటకు చెందిన కోరాడ ఈశ్వరరావు (54) ఖరీఫ్ సీజన్‌లో వరినాట్లు వేసేందుకు ఇటీవల నారుపోశాడు. వర్షాలు లేక నారుమడి ఎండిపోతుండడంతో సమీపంలోని గోపినాథ్‌పట్నాయక్ చెరువు నుంచి ఇంజిన్ సాయంతో నీరు తోడేందుకు ఏర్పాట్లు ప్రారంభించాడు. ఈ క్రమంలో పైపులను పొలంలో అమర్చుతుండగా తెగిపడిన విద్యుత్ తీగెలు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. నారుమడికి నీరుపెట్టి కొద్ది సమయంలోనే ఇంటికి వస్తానని వెళ్లిన భర్త ఎప్పటికీ రాకపోవడంతో భార్య ఆదిలక్ష్మి(48) పొలానికి వెళ్లింది. చెరువు నుంచి వెతుక్కుంటూ వెళ్తుండగా, పచ్చిరొట్ట చేనులో భర్త పడిపోయి ఉండడాన్ని చూసి గగ్గోలు పెడుతూ లేపేందుకు ప్రయత్నించింది. అంతే.. షాక్‌కు గురై క్షణంలో ఆమె కూడా ప్రాణాలు విడిచింది. దీనిని దూరం నుంచి గమనించిన ట్రాక్టర్ డ్రైవర్ ఘటనా స్థలానికి పరుగున వెళ్లాడు. వారిని లేపుదామని ప్రయత్నించే సమయంలో కాస్త షాక్ తగలడంతో వెనుకంజవేశాడు. గ్రామస్తులకు సమాచారం ఇచ్చాడు. గజపతినగరం సీఐ ప్రభాకర్, ఆండ్ర ఎస్ఐ దేవి ఘటనా స్థలానికి చేరుకొని విద్యుత్ అధికారులు ఏడీ శివకుమార్, ఏఈ తిరుపతిరావుతో మాట్లాడారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గజపతినగరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశారు.

గ్రామంలో విషాదఛాయలు..

ఈశ్వరరావు, ఆదిలక్ష్మిలది సన్నకారు రైతు కుటుంబం. ఆలుమగలు ఇద్దరూ కష్టజీవులు. నిరంతరం పొలంలో శ్రమిస్తూ వచ్చిన ఆదాయంతో కుమార్తె, కుమారుడును సాకారు. కుమార్తెకు వివాహం కాగా, డిగ్రీ పూర్తయిన కుమారుడుని ఉన్నత చదువు ప్రవేశ పరీక్ష కోసం రాజమండ్రికి కోచింగ్‌కు పంపించారు. అన్యోన్యంగా, అందరితో మంచిగా ఉండే రైతు దంపతులను విద్యుత్ షాక్ రూపంలో మృత్యువు కాటేయడంతో గ్రామంలో విషాదం అలముకుంది. కుటుంబ సభ్యులు భోరున విలపిస్తున్నారు.

బాధితులకు న్యాయం చేయండి

రైతు దంపతుల మృతి వార్తపై మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర విచారం వ్యక్తంచేశారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని పోలీసులను కోరారు. ఘటనా స్థలాన్ని సర్పంచ్ రామునాయుడు, వైస్ ఎంపీపీ ఈశ్వరరావు, పార్టీ మండలాధ్యక్షుడు రామారావు ఘట నా స్థలాన్ని పరిశీలించారు.

అపర భగీరథుడు వైఎస్సార్

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



విజయనగరం: అపర భగీరథుడు వైఎస్సార్ అని, ఈ నెల 8న ఆయన జయంతిని ఘనంగా నిర్వహిద్దామని జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజనల్ డిప్యూటీ కోఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు, ప్రజలకు శుక్రవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. డాక్టర్ వైఎస్సార్ రాజశేఖరరెడ్డి 75వ జయంతిని పురస్కరించుకుని ప్రతీ నాయకుడు, కార్యకర్త తమ ప్రాంతాల్లో వైఎస్సార్ విగ్రహాలకు పూలదండలు వేసి ఘనంగా నివాళులర్పించాలని కోరారు. ప్రజలందరినీ ఆహ్వానించాలని, పలు సేవా కార్యక్రమాలు చేపట్టాలని, పార్టీ నియోజక వర్గ సమన్వయకర్తలు సమన్వయం చేయాలన్నారు. మహానేత జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడమే ఆయనకు మనమిచ్చే గొప్పనివాళిగా పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా పరిపాలనకు మానవత్వాన్ని జోడించిన మహామనిషి, ప్రజల హృదయాల్లో చెరగని సంక్షేమ సంతకం చేసిన మహానేతగా కొనియాడారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులను సాకారం చేసిన అపర భగీరథుడు ఆయనని, ఉచిత విద్యుత్ పథకంపై తొలి సంతకం చేసి రైతు బాంధవుడయ్యారన్నారు. పేదలకు ప్రాణం పోసిన ఆరోగ్య 'శ్రీ'మంతుడని, ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో నిరుపేద కుటుంబాల్లోని బిడ్డలకు సరస్వతీ కటాక్షం కలిగించిన విద్యాదాతని తెలిపారు. మూడు దశాబ్దాల తన రాజకీయ జీవితంలో ఓటమే ఎరుగుని ఆ అజేయుడని, నమస్తే అక్కయ్యా.. నమస్తే చెల్లెమ్మా.. నమస్తే తమ్ముడూ అని ఆప్యాయంగా పిలిచిన పిలుపు ఎప్పటికీ మన చెవుల్లో ప్రతిధ్వనిస్తూనే ఉంటుందన్నారు. ఆ మహనీయుని జయంతిని ఘనంగా నిర్వహించుకుందామని తెలిపారు.

వేతన బకాయిలు చెల్లించండి

- ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ నాయకుడు అశోక్



ధర్నా చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులు

విజయనగరం ఫోర్ట్: విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలోని ఆస్పత్రుల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులు, సూపర్‌వైజర్లకు పెండింగ్ వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ నాయకుడు బుగత అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వద్ద శుక్రవారం ధర్నా చేశారు. పీఎఫ్ బకాయిలు చెల్లించి ఈఎస్ఐ కార్డులు అందజేయాలన్నారు. కార్యక్రమంలో లక్ష్మి, సన్యాసమ్మ, గణ తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ మేధతో వినూత్న పరిశోధనలు



సదస్సునుద్దేశించి మాట్లాడుతున్న ఛత్తీస్‌గఢ్ అమిటీ యూనివర్సిటీ చాన్సలర్ డాక్టర్ డబ్ల్యు సెల్వమూర్తి

- ఛత్తీస్‌గఢ్ అమిటీ యూనివర్సిటీ వీసీ డాక్టర్ డబ్ల్యూ సెల్వమూర్తి
- జీఎంఆర్ ఐటీలో ప్రారంభమైన అంతర్జాతీయ సదస్సు

రాజాం సిటీ: కృత్రిమ మేధస్సుతో వినూత్నమైన పరిశోధనలు చేసినప్పుడే భారతదేశం 'నాలెడ్జ్ సూపర్'గా మారుతుందని అమిటీ సైన్స్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ చైర్మన్, ఛత్తీస్‌గఢ్ అమిటీ యూనివర్సిటీ చాన్సలర్ డాక్టర్ డబ్ల్యూ.సెల్వమూర్తి అన్నారు. రాజాం జీఎంఆర్ ఐటీలో రెండు రోజులు పాటు జరగనున్న 'ఏఐ–పవర్డ్ టెక్నాలజీ ఇంటిగ్రేషన్ ఫర్ సస్టైనబిలిటీ' అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో కృత్రిమ మేధస్సు (ఏఐ) మానవాళి మనుగడకు దోహదపడే అంశాలను చర్చించడమే సదస్సు ప్రధాన ఉద్దేశమని సెల్వమూర్తి తెలిపారు. భారతదేశం త్వరలో మూడో ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఐదు ట్రిలియన్ల జీడీపీకి చేరుకుంటుందని, ఈ తరుణంలో ఆనందకరమైన, సుసంపన్నమైన, ఆరోగ్యవంతమైన భారతదేశాన్ని నిర్మించుకోవాలని యువతకు పిలుపునిచ్చారు. ఒకప్పుడు మనదేశం గ్లోబల్ సూపర్‌గా ఉండేదని, మళ్లీ ఆ స్థితికి చేరుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో అన్ని రంగాల్లో భారతదేశం ప్రధానభూమిక పోషిస్తుందన్నారు. ముందుగా నాలెడ్జ్ సూపర్‌గా తయారుకావాలని, అందుకు జ్ఞానాన్ని సృష్టించి వినూత్నమైన పరిశోధనలు చేయాలన్నారు. వాటికి కాపీ రైట్స్, హక్కుల విధానంతో ప్రచురించి అందరికీ అందుబాటులోకి తీసుకురావాని ఆకాంక్షించారు. స్వాతంత్ర్యానంతరం వచ్చిన సమాచార యుగంలో దూసుకుపోయామని, ప్రస్తుతం జ్ఞానయుగంలో ఉన్నామని, ఆ తరువాత నాయకత్వ యుగంలోకి మారబోతున్నామని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో వివిధ రంగాల్లో పెరుగుతున్న కృత్రిమ మేధస్సు మానవ జీవితంలో ఒక భాగమై అన్ని రంగాల్లో ప్రభావితం చేస్తుందని అభిప్రాయపడ్డారు. కొత్త టెక్నాలజీ వచ్చినప్పుడు కొంత సందిగ్ధత ఏర్పడినప్పటికీ నూతన అవకాశాలను, అన్వేషణలకు దారి తీస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా దేశ విదేశాల నుంచి మొదటి రోజు వచ్చిన 72 పరిశోధనా పత్రాలను ఆయా పరిశోధకులు ఆన్‌లైన్‌లో ప్రదర్శించగా వాటిపై సుదీర్ఘంగా చర్చించారు. కార్యక్రమంలో జీఎంఆర్ వీఎఫ్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్, సీఈఓ ఎల్.ఎం.లక్ష్మణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

నిమ్మ రైతుకు ధరల పులుపు

- గిట్టుబాటు ధర లేక విలవిల
- తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్న వ్యాపారులు
- సీతంపేట ఏజెన్సీలో 100 ఎకరాల్లో పంట
- కావిడ రూ.400– రూ.500ల మధ్య విక్రయం

సీతంపేట:

వాతావరణం అనుకూలించింది.. నిమ్మకాయల దిగుబడి బాగుంది.. అధిక ఆదాయం వస్తుందని ఆశించిన గిరిజన రైతుకు ధరల దిగులు తప్పడంలేదు. వారపు సంతల్లో పంటకు మద్దతు ధరలు లభించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మైదాన వ్యాపారులు చెప్పిన ధరలకు అమ్మకాలు జరపాల్సి వస్తోందని వాపోతున్నారు. సీతంపేట ఏజెన్సీలోని కొండపోడులో ప్రకృతి సాగు విధానంలో సుమారు 100 ఎకరాల్లో నిమ్మతోటలు విస్తరించి ఉన్నాయి. దిగుబడి బాగున్నా కావిడ నిమ్మ కాయలు కేవలం రూ.400 నుంచి రూ. 500 ధరే పలుకుతోందని, గతంలో ఇదే సీజన్‌లో రూ. 600లకు విక్రయించేవారమని గిరిజన రైతులు చెబుతున్నారు. మైదాన ప్రాంతాల్లో ఒక్కో నిమ్మకాయ రూ.2 వరకు విడిగా విక్రయిస్తారని, ఇక్కడ అర్థ రూపాయి కూడా పలకడంలేదని వాపోతున్నారు.

మైదాన వ్యాపారులదే హవా...

విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, ఒడిశా ప్రాంతాలకు చెందిన వ్యాపారులు ఇక్కడకు వచ్చి నిమ్మకాయలు కొనుగోలు చేస్తారు. సీతంపేటలో సోమవారం, మర్రిపాడులో బుధవారం, దోనుబాయిలో గురువారం, కుశిమి, పొల్ల గ్రామాల్లో శనివారం వారపు సంతలు జరుగుతాయి. ఈ సంతలకు



సంచులతో నిమ్మకాయలను విక్రయానికి తెచ్చిన గిరిజనులు

వ్యాపారులు వచ్చి పంటను కొనుగోలు చేస్తారు. గిరిజన రైతులు చెప్పిన ధరలు కాకుండా వ్యాపారులు సిండికేట్‌గా మారి ధర నిర్ణయిస్తారు. దీంతో వారు చెప్పిన ధరకు విక్రయించాల్సి వస్తోంది. కొన్ని గ్రామాల్లో గిరిజనులు ముందుగా దళారీ వ్యాపారుల నుంచి అడ్వాన్స్‌లు తీసుకుంటారు. పంట పక్వానికి వచ్చే సమయంలో వారు చెప్పిన ధరకే విక్రయించాల్సిన పరిస్థితి. దీంతో రైతులకు ఆదాయం గిటుబాటు కావడం లేదు.

శ్రమకు తగ్గ ఫలితం లేదు



గిరిజనులకు శ్రమకు తగ్గ ఫలితం లభించడం లేదు. కొండల నుంచి కష్టపడి మోసుకొచ్చిన నిమ్మకాయలకు సంతల్లో గిట్టుబాటు ధర పలకడం లేదు. తిరిగి పంటను తీసుకెళ్లలేక వ్యాపారులు నిర్ణయించిన ధరకే విక్రయిస్తున్నాం.

– ఎస్.నరేష్, వంబరెల్లి

మద్దతు ధర కల్పించాలి



సీజనల్‌గా లభించే అటవీ ఉత్పత్తులకు మద్దతు ధర లభించడం లేదు. గిరిశిఖర గ్రామాల నుంచి సంతకు తీసుకొచ్చిన పంటను కారు చౌకగా విక్రయించాల్సి వస్తోంది. రైతులకు కష్టమే మిగులుతోంది. ప్రభుత్వం స్పందించి గిట్టుబాటు ధరలు కల్పించాలి.

– ఎస్.బంగారయ్య, పెద్దగూడ



వ్యాపారులు కొనుగోలు చేసిన నిమ్మకాయలు

క్లుప్తంగా

వైభవంగా సహస్ర దీపాలంకరణ



సీతారామస్వామికి ఊంజల్ సేవ జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువజామున స్వామికి ప్రాతఃకాలార్చన పూజలు నిర్వహించిన తరువాత యాగశాలలో నిత్య హోమాలు, వెండి మంటపం వద్ద స్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా జరిపించారు. సాయంత్రం 6 గంటలకు సీతారామస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా దీపారాధన మంటపంపైకి తీసుకువచ్చి ప్రత్యేక ఊయలలో ఆసీనులను చేశారు. అనంతరం దీపాలు వెలిగించి ఊంజల్ సేవ జరిపించారు. కార్యక్రమంలో అర్చకులు సాయి రామాచార్యులు, నరసింహాచార్యులు, పవన్, భక్తులు పాల్గొన్నారు.

ఫారెస్ట్ రేంజ్ అధికారిగా ఎంపిక



మణికృష్ణను అభినందిస్తున్న తల్లిదండ్రులు

పాలకొండ: పట్టణానికి చెందిన కె.మణికృష్ణ ఏపీపీఎస్సీ ఫలితాల్లో ఫారెస్ట్ రేంజ్ అధికారిగా జోన్-1కు ఎంపికయ్యారు. మణికృష్ణ తండ్రి జనార్దనరావు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడిగా, యోగా గురూజీగా పనిచేస్తున్నారు. తల్లి గృహిణి. ఈ సందర్భంగా మణికృష్ణ మాట్లాడుతూ అటవీశాఖలో ఉద్యోగం రావడం ఆనందంగా ఉందని తెలిపారు. అంకిత భావంతో విధులు నిర్వహించి మంచి పేరు సాధిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా మణికృష్ణకు పలువురు అభినందనలు తెలిపారు.

కొండచిలువ హతం



గ్రామస్తులు హతమార్చిన కొండచిలువ

బొండపల్లి: మండలంలోని వెదురువాడ గిరిజన ప్రాంతంలో శుక్రవారం ఉదయం జనవాసాల మధ్యకు భారీ కొండచిలువ రావడంతో గిరిజనులు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. దీంతో సుమారు 15 అడుగులు పొడవున్న భారీ కొండచిలువను హతమార్చి గ్రామానికి దూరంగా గల కొండ ప్రాంతంలో పూడ్చిపెట్టారు.

రైలు ఢీకొని వ్యక్తిమృతి



మృతుడు పోలీస్ (ఫైల్)

బాడంగి: పొలంపనుల కోసం రైల్వేట్రాక్ దాటి వెళ్తున్న వ్యక్తిని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి గ్రామస్తులు, రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బాడంగి మండలంలోని గొల్లాది గ్రామానికి చెందిన మన్నెలపోలీస్(48) తన అల్లుడు భాస్కరరావు పొలంపనులకోసం వేకువజామున ఇంటివద్ద బయలుదేరి వెళ్తుండగా భీమవరం-బాడంగి లిమిట్స్ నక్కలచెరువు వద్ద పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. దీంతో తల, కాళ్లకు బలమైన గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య అప్పమ్మ, శ్రావణి.సంధ్య అనే ఇద్దరు ఆడపిల్లలున్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి స్థానిక సీహెచ్‌సీలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు రైల్వే పోలీసులు అప్పగించారు.

మేడపై నుంచి జారిపడి మహిళ..



కమ్మిండి సామాలమ్మ (ఫైల్)

గుర్ల: మండల కేంద్రానికి చెందిన కమ్మిండి సామాలమ్మ (44) మేడపై నుంచి జారిపడి శుక్రవారం మృతి చెందింది. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. కమ్మింగి సామాలమ్మ తన ఇంటి మేడపైకి దుస్తులు ఆరవేయడానికి వెళ్లి పని పూర్తి చేసుకుని వస్తుండగా అకస్మాత్తుగా జారిపోయి కిందకు పడిపోయింది. దీంతో తలకు తీవ్ర గాయాలు కాగా కుటుంబసభ్యులు గమనించి గుర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి ఆటోలో తరలించారు. కేంద్రాస్పత్రిలో చికిత్స చేస్తుండగా ఆమె మృతి చెందిందని వైద్యాధికారులు తెలిపారు. మృతురాలికి భర్త పైడపృుడు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై భాస్కరరావు తెలిపారు. గుర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స అందకపోవడంతో సామాలమ్మ మృతి చెందిందని మృతురాలి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹132	₹234	₹244

పశువుల నుంచి మనుషులకు..!

- జునోటిక్ వ్యాధులతో జాగ్రత్త
- పశుపోషకులు, పెంపుడు జంతువుల యజమానులు, రైతులకు సోకే అవకాశం
- అప్రమత్తంగా లేకపోతే ప్రాణానికే ప్రమాదం
- రేబిస్, బర్డ్లూ, అంత్రాక్స్‌లది ఒకే కోవ
- నేడు ప్రపంచ జునోసిస్ దినోత్సవం



వేపాడ: పెంపుడు కుక్కలకు యాంగా రేబిస్ వ్యాధి నిరోధక టీకా వేసేందుకు సిద్ధమైన పశువైద్యులు

పార్వతీపురంటౌన్/భామిని/వేపాడ: పశువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి పశువులకు సంక్రమించే స్వభావం ఉన్న వ్యాధుల్ని జునోటిక్ వ్యాధులు (సంక్రమిత వ్యాధులు) అంటారు. సుమారు 200కు పైగా జునోటిక్ వ్యాధులు ఉన్నట్లు గుర్తించారు. ఈ వ్యాధులు ఎక్కువగా పశుపోషకులు, పాల ఉత్పత్తిదారులు, పెంపుడు కుక్కల యజమానులు, వ్యవసాయం చేసే రైతులు, పశువైద్యులు, జంతు ప్రదర్శన శాలల సిబ్బంది, పరిశోధన శాలల్లో పనిచేసే సిబ్బందికి వస్తుంటాయి లూయీ పాశ్చర్ అనే శాస్త్రవేత్త మొట్టమొదటిసారిగా 1885వ సంవత్సరం జూలై 6న పిచ్చికుక్క కాటుకు గురైన వ్యక్తి ప్రాణాలను 'యాంటీ రేబిస్ టీకా' ద్వారా కాపాడిన సందర్భంగా ప్రతి సంవత్సరం జూలై 6వ తేదీని 'జునోసిస్ డే' గా జరుపుకుంటున్నారు. జునోటిక్ వ్యాధులను వైరస్, బాక్టీరియల్, ప్యారసైటిక్‌లుగా విభజించారు. వైరస్ వల్ల సంక్రమించే వ్యాధులలో పిచ్చి కుక్కకాటు వ్యాధి (రేబిస్), మెదడువాపు వ్యాధి (జపనీస్ ఎన్సెఫలైటిస్), బర్డ్లూ ముఖ్యమైనవి. బాక్టీరియా వల్ల సంక్రమించే వ్యాధుల్లో బ్రూసెల్లా, సాల్మోనెల్లా, లెప్టోస్పైరోసిస్, క్షయ, దొమ్మరోగం, ధనుర్వాతం ముఖ్యమైనవి. పరాన్న జీవుల వల్ల సంక్రమించే వ్యాధుల్లో బద్దెపురుగులు, ఏలికపాములు, ఫైలేరియా హైడాటిడ్ వ్యాధులు ముఖ్యమైనవి. ప్రపంచ జునోసిస్ దినోత్సవం జంతువులు, మానవుల మధ్య వ్యాధుల వ్యాప్తిని నిరోధించడంలో మన ఉమ్మడి బాధ్యతను గుర్తుచేస్తుంది. వ్యాధులపై అవగాహన, నివారణ చర్యలను తీసుకోవడం ద్వారా వ్యాధుల బారిన పడకుండా కాపాడడంతో పాటు మానవులు, జంతువుల ఆరోగ్యాన్ని సంరక్షించడంలో కీలక పాత్ర పోషిస్తోంది.



భామిని:పెంపుడు కుక్కలకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారులు

పెంపుడు జంతువుల యజమానులకు సూచనలు

- పెంపుడు జంతువుల్లో ముఖ్యంగా రేబిస్ నివారణ కోసం టీకాలు సకాలంలో వేయించడం ముఖ్యం. పశువైద్యుడు సూచించిన టీకాల షెడ్యూల్‌ను తప్పనిసరిగా పాటించాలి.
- పెంపుడు జంతువులను, వాటి ఆహారాన్ని లేదా వ్యర్థాలను తాకిన తర్వాత చేతులను శుభ్రంగా కడగాలి. లిట్టర్ బాక్సులు, పంజరాలను తరచూ శుభ్రం చేయాలి.
- బయట తిరిగే జంతువులకు క్రమం తప్పకుండా క్రిములను తొలగించాలి.
- పెంపుడు జంతువులు అడవి జంతువులతో కలవకుండా చూడడంతో పాటు, సరైన రక్షణ లేకుండా గాయపడిన అడవి జంతువులను రక్షించడానికి ప్రయత్నించవద్దు.
- అనారోగ్య లక్షణాలను గమనించాలి. ప్రవర్తన, ఆకలి, లేదా రూపంలో మార్పులను గమనించడం, ఏదైనా అసాధారణమైనది గమనిస్తే వెంటనే పశువైద్యుడిని సంప్రదించాలి.

పాడి రైతులకు..

బలమైన జీవభద్రతా చర్యలను అమలు చేయాలి. పశువుల దగ్గరకు అవసరమైన వ్యక్తులను మాత్రమే అనుమతించాలి. జంతు సమూహాల మధ్య కదిలేటప్పుడు పాద రక్షలు, రక్షిత దుస్తులను ఉపయోగించాలి. పశువులశాలలు, పాలు పిండే ప్రదేశాలు, పరికరాలను క్రమం తప్పకుండా శుభ్రంచేయాలి. పాలు పిండేటప్పుడు కఠినమైన పరిశుభ్రతా నియమాలను అమలు చేయాలి. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలి. అనారోగ్యంతో ఉన్న జంతువులను వెంటనే మంద నుంచి వేరు చేయాలి.

18,380 యాంటీ రేబిస్ టీకాల పంపిణీ

జిల్లా వ్యాప్తంగా అన్ని పశువైద్యశాలలు, ప్రాంతీయ పశు వైద్యశాలలు, వెటర్నరీ పాలిక్లినిక్స్, వెటర్నరీ హాస్పిటల్స్ వద్ద ఉచితంగా టీకాలు వేయడానికి ఏర్పాట్లు చేశాం. ఇందుకోసం జిల్లాలో 18,380 వేల యాంటీ రేబిస్ టీకాలు సిద్ధం చేశాం. జునోసిస్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవడం వల్ల మనుషులు, జంతువులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది. ముఖ్యంగా ప్రాణాంతక జునోసిస్ వ్యాధులపై సరైన అవగాహన ఉంటే చాలా వరకు అరికట్టవచ్చు. జునోసిస్ వ్యాధుల సంక్రమణ, నివారణపై అవగాహన కలిగించేందుకు ప్రాథమిక విద్య నుంచి ఆ వ్యాధులపై విద్యార్థులకు తెలియజేయాలి.

– ఎస్.మన్మథరావు, జిల్లా పశు వైద్యశాఖాధికారి, పార్వతీపురం మన్యం

కోళ్ల రైతులకు..

కోళ్లను పెంచే ప్రాంతాల్లో ప్రత్యేక దుస్తులు, పాదరక్షలను ఉపయోగించాలి. ఒకే వయస్సు ఉన్న పక్షులను కలిపి పెంచడం, గుంపుల మధ్య పూర్తిగా శుభ్రపరిచి, ఆ ప్రాంతంలో క్రిమిసంహార మందులు చల్లాలి. అడవి పక్షులతో సంపర్కాన్ని నివారించడానికి వలలు లేదా మూసివేసిన గూళ్లను ఉపయోగించాలి. ఆహారం తీసుకోవడంలో లేదా గుడ్ల ఉత్పత్తిలో తగ్గుదల వంటి అనారోగ్య లక్షణాలను గమనించడంతో పాటు, అసాధారణ మరణాలు లేదా లక్షణాలను వెంటనే పశువైద్య అధికారులకు తెలియజేయాలి. పక్షులు లేదా గుడ్లతో సంపర్కం తర్వాత చేతులను పూర్తిగా కడగాలి.

మహిళలపై లైంగిక వేధింపులను అరికట్టాలి

- కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్

విజయనగరం అర్బన్: పనిచేసే ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులను పూర్తిగా అరికట్టాలని వేధించే నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్ ఆదేశించారు. పనిచేసే ప్రదేశంలో లైంగిక వేధింపుల చట్టం-2013 అమలుపై మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లా అధికారులు, సిబ్బందికి కలెక్టరేట్ ఆడిటోరియంలో శుక్రవారం ఆయన శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా మహిళలపై వేధింపులు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామస్థాయిలో అవగాహన కల్పించినప్పుడే ఈ చట్టం పూర్తిస్థాయిలో అమలవుతుందని అభిప్రాయపడ్డారు. దీని కోసం అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో కృషి చేయాలని కోరారు. చట్టం అమల్లోకి వచ్చి సుమారు 11 సంవత్సరాలు పూర్తయినా ఇంకా అవగాహన స్థాయిలోనే ఉండడం విచారకరమన్నారు. చట్టం వల్ల తమకు రక్షణ లభిస్తుందన్న విషయం మహిళలకు తెలియాలని ఈ చట్టం వారికి ధైర్యాన్ని ఇవ్వాలని సూచించారు. చట్టాన్ని అమలు చేసేందుకు వివిధ కార్యాలయాల్లో ఏర్పాటైన కమిటీలు మరింత చురుగ్గా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ చట్టం కింద కేసు నమోదు చేయడమే కాకుండా కఠినంగా శిక్ష పడినపుడే వేధింపులు ఆగుతాయని కలెక్టర్ స్పష్టం చేశారు.

మహిళలు సురక్షితంగా ఉండాలి

జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలతోపాటు అసంఘటిత రంగంలో కూడా చట్టాన్ని అమలు చేయాలని కోరారు. పనిచేసే ప్రదేశాల్లో మహిళలు, సురక్షితంగా భద్రంగా ఉండాలన్నది ఈ చట్టం ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు. స్థానిక, అంతర్గత కమిటీలు పూర్తిస్థాయిలో పనిచేయాలని సూచించారు. అదనపు ఎస్పీ అస్మాఫర్హీన్ మాట్లాడుతూ బాధితులకు న్యాయం జరిగేందుకు వారి పక్షాన నిలిచేలా చట్టం అమలు తీరు ఉండాలని ఆకాంక్షించారు. మహిళలకు రక్షణ కల్పించేందుకు భారతీయ న్యాయ సంహితలో ఉద్దేశించిన వివిధ చట్టాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్‌డీ అనిత, ఆర్‌డీఓలు ఎంవీసూర్యకళ, ఎ.సాయిశ్రీ, బి.శాంతి, వివిధ శాఖల అధికారులు, సీడీపీఓలు, ఐసీడీఎస్ అధికారులు, వన్‌స్టాప్ సెంటర్ నిర్వాహకురాలు విజయలక్ష్మి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

చెక్‌బౌన్స్ కేసులో ముద్దాయికి రెండేళ్ల జైలు

పాలకొండ: చెక్‌బౌన్స్ కేసులో ముద్దాయికి రెండు సంవత్సరాల జైలుశిక్ష, రూ.రెండు లక్షల జరిమానా విధిస్తూ స్థానిక జూనియర్ సివిల్ జడ్జి శుక్రవారం తీర్పు వెల్లడించారు. ఈ కేసు వివరాలిలా ఉన్నాయి. బూర్జమండలం లచ్చయ్యపేటకు చెందిన గిరిడ చిన్నారావు రెండు లక్షల చెక్కును బొండపల్లి వెంకటరమణకు ఇచ్చాడు. చిన్నారావు ఇచ్చిన చెక్కు బౌన్స్ కావడంతో న్యాయం కోసం బాధితుడు కోర్టును ఆశ్రయించాడు. ఈ కేసును విచారణ చేసిన న్యాయమూర్తి చిన్నారావును దోషిగా నిర్ధారించి రూ.రెండు లక్షల జరిమానాతో పాటు, రెండు సంవత్సరాల జైలుశిక్ష విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో రెండు నెలల పాటు అదనంగా జైలుశిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు.

ప్రైవేట్ సంస్థల్లో 850 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

పార్వతీపురంటౌన్: పార్వీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ సంస్థలలో 850 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వహిదా తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 8న పార్వతీపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు చెప్పారు. బీఎఫ్ఐఎల్ సినర్జీస్ క్యాపిటల్ లిమిటెడ్ యంగ్ ఇండియా టీమ్ లీజు పేటీఎం సంస్థలలో పలు ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు వివరించారు. 8వ తరగతి నుంచి ఏదైనా డిగ్రీ, డిప్లమో, ఐటీఐ, అర్హత కలిగిన అభ్యర్థులు ఈ జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని, ఆసక్తి కలిగిన అభ్యర్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్సీఎస్.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. 8వ తేదీన బయోడేటా, రెండు పాస్‌పోర్ట్‌సైజు ఫొటోలతో హాజరుకావాలని పేర్కొన్నారు.

10న ఎస్‌వీ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డా.సీహెచ్ చలపతిరావు

పార్వతీపురంటౌన్: జిల్లాకేంద్రం పార్వతీపురం పట్టణంలోని ఎస్‌వీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలో ఈనెల 10న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.సీహెచ్ చలపతిరావు తెలిపారు. ఈ మేరకు కళాశాలలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ ఈ జాబ్‌మేళాలో నిట్, ఐసీఐసీఐ బ్యాంక్, డెక్కన్ కెమికల్స్, యాక్సిస్ బ్యాంక్, ఫాక్స్‌కాన్, ఆల్‌స్టామ్, డైకి అల్యూమినియం ఇండస్ట్రీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, డిక్సాన్, హ్యుండాయ్ మోబీస్ అండ్ రాక్‌మెన్ ఇండస్ట్రీస్ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. రిలేషన్‌షిప్ మేనేజర్ ట్రైనీ, బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ టెక్నీషియన్, క్వాలిటీ, ప్రొడక్షన్ అండ్ మెయిన్‌టెనెన్స్ విభాగాల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని, ఎస్ఎస్‌సి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన 35 సంవత్సరాలోపు అభ్యర్థులు అర్హులని స్పష్టం చేశారు. ఎంపికైన వారికి నెలకు రూ. 12వేల నుంచి రూ.25వేల వరకు జీతం, ఇన్సెంటివ్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 10వ తేదీ బుధవారం ఎస్‌వీ గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్స్, జిరాక్స్‌లతో హాజరు కావాలని సూచించారు.

బకాయి వేతనాలు చెల్లించాలి

- ఐటీడీఏ వద్ద కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ నిరసన



ఐటీడీఏ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు

పార్వతీపురంటౌన్: కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌కు ఐదు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని సీఐటీయూ నాయకులు గొర్లి వెంకటరమణ కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయం వద్ద కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌తో కలిసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో ఆరోగ్య సేవలు అందిస్తూ పనిచేస్తున్న వారికి ఐదు నెలలుగా బకాయ వేతనాలు అందలేదన్నారు. గుర్తింపు కార్డులు యూనిఫాం ఇవ్వాలని అధికారులకు అనేక సార్లు విన్నవించామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ సమస్యలు పరిష్కారించాలని విజ్ఞప్తి చేశారు. సీహెచ్‌డబ్ల్యూలను ఆశ కార్యకర్తలుగా మార్పుచేసి కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతినెలా క్రమం తప్పకుండా వేతనాలు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వి.ఇందిర, కుమారి, అప్పలనరసమ్మ, భారతి, జీవిత దమయంతి, దివ్య అరుణ, ధనలక్ష్మి, రజని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు పాల్గొన్నారు.

ఎంఈఓల సమస్యలపై డీఈఓకు వినతి



ఎంఈఓల సమస్యలపై డీఈఓ పగడాలమ్మకు వినతిపత్రం అందజేస్తున్న, రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం

పార్వతీపురంటౌన్: ఎంఈఓల సమస్యలు పరిష్కరించాలని సంఘం ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎంఈఓ-1 అసోసియేషన్ మన్యం జిల్లా నాయకులు ఎన్.నాగభూషణ రావు, డి.గౌరు నాయుడులతో కలిసి డీఈఓకు వినతిపత్రం సమర్పించారు. ముఖ్యంగా ఎంఈఓ కార్యాలయాల నిర్వహణ గ్రాంట్స్ గత ఏడాది నుంచి విడుదల చేయకపోవడం వల్ల ఆఫీస్ నిర్వహణ ఖర్చులు ఎంఈఓలే భరించాల్సి వస్తోందన్నారు. అందువల్ల ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డీఈఓను కోరారు. తమ సమస్యల పట్ల స్పందించిన డీఈఓకు ఎంఈఓ-1 అసోసియేషన్ తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

పురుగు మందుల దుకాణాలలో విజిలెన్స్ తనిఖీ

రామభద్రపురం: రైతులకు నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులు అందించడమే లక్ష్యమని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ ఎస్ తాతారావు, విజయవాడ వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయ ఎ.డి ఆర్.గంగాధరరావు అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని వాసవి విత్తనాలు, పురుగుమందుల దుకాణంలో శుక్రవారం వారు అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో దుకాణంలో ఉన్న నిల్వలకు తగినట్లు రికార్డు నిర్వహణ లేకపోవడంతో పాటు కొన్ని రకాల విత్తనాలు, పురుగు మందులు నాసిరకంగా ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. అలాగే కాల పరిమితి దాటిన గుళికలు విక్రయిస్తున్నట్లు పసిగట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో అధికంగా రైతులు ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేస్తారని, వారికి నాణ్యమైన సరుకులు అందించాలన్న ఉద్దేశంతో పురుగు మందుల షాపులనుఆయా మండలాల వ్యవసాయాధికారులతో కలసి తనిఖీ చేస్తున్నామన్నారు. ఈ పురుగుమందుల దుకాణంలో నిల్వ రిజిస్టర్, అమ్మకం రసీదులు లేకుండా అక్రమంగా అమ్మకం చేస్తున్నట్లు తనిఖీలో గుర్తించామని తెలిపారు. రూ.1.84 లక్షలు విలువ చేసే 44.500 కేజీల విత్తనాలు, రూ.7.31 లక్షలు విలువ చేసే 914 కేజీలు పురుగు మందులు నాసిరంగా ఉన్నాయన్న అనుమానంతో సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ప్రాథమికంగా గుర్తించిన పురుగుమందులు, విత్తనాలను పూర్తిగా నాణ్యత లేని సరుకులుగా నిర్ధారించేందుకు వ్యవసాయాధికారుల ద్వారా ల్యాబ్‌కు పంపిస్తున్నామని, పూర్తిగా నాణ్యత లేని ఎరువులుగా నిర్ధారణ అయిన తరువాత చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ తనిఖీలో స్థానిక ఎ.డి శ్యామ్‌సుందర్, ఏవో వెంకటయ్య పాల్గొన్నారు.

మహిళలకు చేయూత అందించాలి

- కలెక్టరేట్ ఎదుట నిరసన



కలెక్టరేట్ ఆవరణలో ఆందోళన చేస్తున్న ఐద్వా నాయకులు

పార్వతీపురం: మహిళలకు చేయూత నగదు రూ.18,750లు అందించాలని అఖిల భారత మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అర్హులైన మహిళలందరికీ చేయూత డబ్బులు రూ.18,750లు నాలుగో విడతలో విడుదల చేసిందని, అతి తక్కువ మందికి బ్యాంకు ఖాతాలో డబ్బులు జమయ్యాయన్నారు. ఎక్కువ మంది మహిళలకు చేయూత డబ్బులు వారి ఖాతాలో జమ కాలేదని, అర్హులైన అందరికీ చేయూత డబ్బులు ఇప్పటి ప్రభుత్వం జమచేయాలని లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని స్పష్టం చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏఓ ఎ.వేణుగోపాలరావుకు వినతిపత్రం0అందించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు గెద్ద తులసి, బౌరోతు గౌరమ్మ, దాసరి మంగమ్మ, బెలగాం రమణమ్మ, విజయగౌరి, సీఐటీయూ పట్టణ నాయకులు బంకురు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ పేరిట ఫీజుల దగా

- టెట్ దరఖాస్తుల నెపంతో మోత
- రెండు మెథడాలజీలకు వేర్వేరుగా చెల్లింపు తప్పనిసరి
- ఒక్కో దరఖాస్తుకు రూ.750
- పెంచిన పోస్టులపై క్లారిటీ లేకుండా టెట్ నిర్వహణ
- లాంగ్వేజీ సబ్జెక్టులలో ఇంగ్లీషు, తెలుగుకు అదనంగా టెట్ నిబంధన
- లబోదిబోమంటున్న అభ్యర్థులు

రాజాం:

మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలకాకముందే రాష్ట్ర ప్రభుత్వం టెట్ పరీక్ష పేరుతో ఫీజుల దోపిడీకి తెరతీసింది. ఇదివరకు గత ప్రభుత్వం టెట్ నిర్వహించి, డీఎస్సీకి అంతా సిద్ధం చేయగా, మెగా డీఎస్సీ పేరుతో కొత్త ప్రభుత్వం గతంలో కంటే మరికొన్ని పోస్టులు ప్రకటించింది. పాత డీఎస్సీ నోటిఫికేషన్ రద్దుచేసి ఆ స్థానంలో కొత్త డీఎస్సీకి నోటిఫికేషన్ ఇవ్వకుండా, కొత్తగా టెట్‌కు నోటిఫికేషన్ ఇచ్చింది. దీంతో ఉపాధ్యాయ పోస్టుల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతలో ఆందోళన మొదలైంది. ఇప్పటికే గత ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ నిమిత్తం సిద్ధమైన అభ్యర్థులంతా కొత్త ప్రభుత్వ నిబంధనలతో డైలమాలో పడ్డారు. కొత్త డీఎస్సీ ఉంటుందో? లేదో? తెలియని అయోమయంలో ఉండగా, ప్రస్తుతం నోటిఫికేషన్ విడుదలచేసిన టెట్‌కు మళ్లీ సన్నద్ధమవాల్సిన పరిస్థితి వచ్చింది.

వదలనున్న చేతిచమురు

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన టెట్ పరీక్షకు రాయాల్సిన అభ్యర్థులకు చేతిచమురు బాగా వదలనుంది. ఒక్కో పేపర్‌కు రూ.750 అభ్యర్థి చెల్లించాల్సి వస్తుంది. పేపర్-1(ఎ)లో 1 నుంచి 5 వతరగతి వరకూ బోధించే ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల నిమిత్తం, పేపర్-1(బి)లో ప్రత్యేక అవసరాల పిల్లలు కలిగిన పాఠశాలల సెకెండరీ గ్రేడ్ టీచర్స్ నిమిత్తం ఫీజు చెల్లించాల్సి ఉంది. వీటికి డీఈడీతో పాటు స్పెషల్ డీఈడీ చేసిన అభ్యర్థులు అర్హులు. పేపర్-2 (ఎ)లో ఒక విభాగంగా స్కూల్ అసిస్టెంట్ మ్యాథమెటిక్స్ అండ్ సైన్స్ ఒక సబ్జెక్టుగా, రెండో విభాగంలో సోషల్ స్టడీస్ ఇంకో సబ్జెక్ట్‌గా ఇచ్చి దరఖాస్తులు తీసుకుంటున్నారు. పేపర్-2(ఎ)లో మూడో విభాగంలో వరుసగా తెలుగు, ఉర్దూ, హిందీ, కన్నడ, ఒడియా, తమిళ, సంస్కృత భాషలతో పాటు ఇంగ్లీషు సబ్జెక్టుకు దరఖాస్తు చేసుకునేలా ఏర్పాట్లు చేశారు. ఇక్కడే అసలు సమస్య మొదలైంది. తెలుగు, హిందీ భాషా పండిట్ ట్రైనింగ్ కళాశాలలో శిక్షణ పొందినవారికి ఈ లాంగ్వేజీ పండిట్ పోస్టులు రాసేందుకు టెట్ రాయల్సి ఉంది. అలా కాకుండా బీఈడీ శిక్షణ చేసే సమయంలో ప్రతి విద్యార్థి రెండు మెథడ్స్‌ను తీసుకుని శిక్షణ పొందుతారు. ఆ సమయంలో చాలామంది మ్యాథమెటిక్స్, సైన్స్, సోషల్ స్టడీస్‌తో పాటు తెలుగు, ఇంగ్లీషు మెథడ్‌ను రెండో ఆప్షన్‌గా తీసుకుని శిక్షణ పొందుతారు. వీరు ఇప్పుడు టెట్‌లో రెండు మెథడాలజీలకు సంబంధించి రెండేసి టెట్‌లు రాయాల్సి వస్తుంది. దీంతో వారంతా అదనపు ఫీజులు చెల్లించడంతో పాటు రెండు సబ్జెక్టులకు ఒకే దఫా టెట్ రాయాల్సి వస్తుంది. మ్యాథమెటిక్స్‌తో పాటు సైన్స్‌ను బీఈడీలో మెథడ్స్‌గా తీసుకున్న అభ్యర్థులకు ఈ సమస్య రావడం లేదని, కేవలం లాంగ్వేజీలను రెండో మెథడ్‌గా తీసుకున్న అభ్యర్థులకు మాత్రమే ఈ సమస్య వస్తోందని వాపోతున్నారు. ఒక వైపు టెట్ దరఖాస్తు ధర ఒక్కో సబ్జెక్ట్‌కు రూ.750 ఉండడం, మరో వైపు ఒక్కొక్కరు రెండేసి సబ్జెక్టులకు దరఖాస్తు చేసుకోవాల్సి వస్తుండడంతో ప్రభుత్వ తీరును తప్పుబడుతున్నారు. గతంలో ఇటువంటి సమస్య రాలేదని, ఈ సమస్యపై అధికారులు స్పందించి, ఒకే టెట్ అర్హతతో బీఈడీ అభ్యర్థులకు రెండేసి మెథడాలజీలకు వినియోగపడేలా అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

స్పష్టత లేకుండానే..

ప్రస్తుతం ఉపాధ్యాయ పోస్టులపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో 583 అసిస్టెంట్, 267 ఎస్జీటీ పోస్టులు ప్రకటించారు. ఇందులో స్కూల్ అసిస్టెంట్ పోస్టులను సబ్జెక్టుల వారీగా ఇంతవరకూ ఇవ్వలేదు. దీంతో ఎన్ని పోస్టులు? ఏఏ సబ్జెక్టులకు ఉంటాయన్నది తెలియక అభ్యర్థుల్లో గందరగోళ పరిస్థితి నెలకొంది. ఈ అసిస్టెంట్‌లలో ఫిజికల్ ఎడ్యుకేషన్, లాంగ్వేజీ పండిట్‌లు పోస్టులు కొన్నింటిని కలపడం, ఇవి కాకుండా ప్రత్యేకంగా మళ్లీ పీఈటీ పోస్టులు, లాంగ్వేజీ గ్రేడ్-2 పండిట్ పోస్టులు చూపించడం అయోమయంగా మారింది. ఈ పోస్టుల్లో చాలామంది ఈ అకడమిక్ ఇయర్ చివరి నెలలో పదవీ విరమణ చేయబోతున్న వారి ఖాళీల ప్రకారం గుర్తించారని పలు ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. దీంతో ఈ మెగా డీఎస్సీ పేరులోనే తప్ప ప్రకటనలో లేనట్టు కనిపిస్తోందని సర్వత్రా చర్చనీయాంశంగా ఉంది.